


# కరపత్రం

SINCE 2014

శనివారం ఏప్రిల్ 11, 2026 | సంపుటి : 2 | సంచిక : 180 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై
# కాంగ్రెస్ ఫోకస్

» మహిళా బిల్లు, డిలిమిటేషన్ అంశాలపై చర్చ
» ఈ రెండు అంశాలపై కాంగ్రెస్ సుదీర్ఘ కసరత్తు
» రాజకీయ లబ్ధికోసంమే ప్రత్యేక సమావేశాలన్న ఖర్గే
» తెలంగాణలో డీ లిమిటేషన్ నూ రేవంత్ నివేదిక సమర్పణ

న్యూఢిల్లీ,ఏప్రిల్10 :
జాతీయ రాజకీయాల్లో రాబోయే మార్పులు, కేంద్ర ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొట్టే దిశగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం సమాలోచనలు చేసింది. ముఖ్యంగా పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. మహిళా బిల్లు, సీట్లు పెంపుదల వంటి రెండు అంశాలపై వ్యూహాత్మకంగా ఉండాలని నిర్ణయించారు. దేశ రాజధాని ఢిల్లీ ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీసమావేశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఈ భేటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం ప్రారంభమైంది. ఈ భేటీకి కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా సోనియా గాంధీ, సీనియర్ నేత పి. చిదంబరం వర్చువల్‌గా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సల్మాన్ ఖుర్షీద్, అంబికా సోనీ, సచిన్ పైలట్, భూపేశ్ బగేల్ తదితరులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కు ఈ సమావేశంలో పాల్గొని తమ రాష్ట్రాల నివేదికలను సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధానంగా ఈ క్రింది అంశాలపై తన వాణిని వినిపించాలని నిర్ణయించింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరిని ఖరారు చేయనుంది. ఓబీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలనే డిమాండ్‌పై కూడా చర్చించారు. 2026 తర్వాత జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై సీఎంలు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య తమ వాదనలు వినిపించారు.

మిగతాది 2లో

## అన్నా.. నన్ను
# దేవుడే పంపిండు...

♦ మీతో కలిసి పని చేయమని చెప్పిండు
♦ ఎర్రవల్లిలో కెసిఆర్‌తో జీవన్ రెడ్డి భేటీ
♦ ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని పలకించిన కెసిఆర్



గజ్వేల్,ఏప్రిల్10
బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను పలకరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. ' అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయమని' అంటూ



కేసీఆర్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జీవన్ రెడ్డి , కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కేసీఆర్‌ను కలిసినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై చర్చించారు. తాజా రాజకీయాలు, కాంగ్రెస్ తీరును ఆయన కెసిఆర్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి తొలిసారి వచ్చిన జీవన్ రెడ్డిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డా. కె.సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.' తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్ల కైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది' అంటూ మనసులోని మాటను వ్యక్తం చేశారు. ఈ సంధ్భంగా జీవన్‌రెడ్డిని కేసీఆర్ సన్మానించారు. జీవన్ రెడ్డి కూడా కెసిఆర్‌కు శాలువా కప్పి సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా ఉండి, తెలంగాణ తనానికి దర్పణంగా నిలిచే జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం, కేసీఆర్‌ను 'అన్నా' అని సంబోధిస్తూ భావోద్వేగానికి లోనవ్వడం చూస్తుంటే.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు సంభవించబోతున్నాయని స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ఈ చేరిక ఒక పెద్ద ఊతమివ్వనుంది.



## రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ ప్రమాణం

న్యూఢిల్లీ,ఏప్రిల్10 :
బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శుక్రవారం రాజ్యసభ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సి.పి రాధాకృష్ణన్ తన ఛాంబర్‌లో నితీష్‌కుమార్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. నితీష్‌కుమార్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, రాజ్యసభ నేత జెపి నడ్డా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌లు హాజరయ్యారు.

2 లో



## ఏదుల రిజర్వాయర్ భూసేకరణ కోసం ఎంతో కష్టపడ్డా

మాజీ మంత్రి సింగరెడ్డి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్10 :
ఏదుల రిజర్వాయర్ భూసేకరణ కోసం తాను ఎంతో కష్టపడ్డానని, భూమి ఇవ్వాలని రైతుల కాళ్లు మొక్కుతా అని విజ్ఞప్తి చేసినట్లు మాజీ మంత్రి సింగరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.

# కాళేశ్వరాన్ని రెండేళ్లుగా ఎందుకు నానబెట్టారు

» ఇప్పుడే రిపేర్లు చేయడంలో ఆంతర్యం ఏమిటో
» గతంలోనే చేసివుంటే రైతులకు మేలు జరిగేది కదా
» కేవలం కమిషన్ల కోసమేనేమో అన్న అనుమానాలు
» రియల్ ఎస్టేట్ కోసమే ఫ్యూచర్ సిటీ జపం
» జిహెచ్ఎంసిలో తీవ్ర అవినీతి జరుగుతోంది
» మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత

హైదరాబాద్,ఏప్రిల్10 :
కాళేశ్వరాన్ని వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. రెండున్నరేళ్లు దారుణంగా వ్యవహరించి పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ న ఇర్ణయం తీసుకుని ఉంటే రైతులకు మేలు జరిగి ఉండేదని అన్నారు.



2లో..



2లో..

# పిచ్చి వాగుడు వాగితే ఖబర్దార్

» అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లపై దుష్ప్రచారమా
» మండిపడ్డ మంత్రి సీతక్క

భద్రాద్రి కొత్తగూడెం,ఏప్రిల్10 :
అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని స్త్రీ శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. అంగన్వాడీ అంటే అమ్మఒడి అంటూ సీతక్క అభివర్ణించారు. మినీ అంగన్వాడీలను కాంగ్రెస్ ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిందని.. ఆ టీచర్లకు ఇప్పుడు రూ.2 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్లు కూడా ఇస్తున్నామని పేర్కొన్నారు. అంగన్వాడీలకు గతంలో సెలవులు కూడా ఉండేవి కాదని.. కాంగ్రెస్ సర్కార్‌లో వారికి సెలవులు ఇస్తున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు.

## త్వరలో తెలంగాణ లిక్కర్ చార్జీలు పెంపు..!



హైదరాబాద్:
తెలంగాణలో లిక్కర్ చార్జీల పెంపునకు రంగం సిద్ధమవుతోంది. త్వరలో రాష్ట్రంలో లిక్కర్ చార్జీలు పెరుగనున్నాయి. ఈ నెలాఖరుకల్లా చార్జీల పెంపుపై నిర్ణయం కమిటీ నిర్ణయం తీసుకోనుంది. లిక్కర్ చార్జీల పెంపును 12 నుంచి 15 శాతం వరకూ పెంచాలని కంపెనీల ప్రతిపాదనలు పంపగా, దానిపై కమిటీ నిర్ణయం తీసుకోనుంది.ఇప్పటికే బీర్ల ధరలను ప్రభుత్వం పెంచగా, మళ్లీ లిక్కర్ ధరలను పెంచాలని భావిస్తోంది. రెండేళ్లకొకసారి లిక్కర్ ధరలను పెంచే నిబంధన ఉందని అధికారులు అంటుండగా, లిక్కర్ ధరలు పెరిగి దాదాపు మూడేళ్లు అవుతుందని ప్రభుత్వం అంటోంది. దాంతో లిక్కర్ ధరల పెంపునకు ప్రభుత్వం ఇప్పటికే సిద్ధమైందనే విషయం అర్థమవుతోంది.




# డిజిపి ఎదుట లొంగిపోయిన కేశాలు

▪ మొత్తం 42 మంది ఆయుధాలతో లొంగుబాటు
▪ వారికి పునరావాసం కల్పిస్తామన్న శివధర్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్10 :
తెలంగాణ పోలీసుల ఎదుట మావోయిస్టు అగ్రనేత, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ డిప్యూటీ కమాండర్ సోడిమల్ల కేశాలు లొంగిపోయారు. అతనితోపాటు మొత్తం 42 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారు. ఛత్తీస్‌గఢ్- తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల నుంచి వచ్చి వీరంతా లొంగిపోయారు.

2లో..



02

## పదేళ్లలో తెలంగాణను
# ఆగం చేశారు

» ఇప్పుడేమో ఘనకార్యాలు చేసినట్లు బిల్డప్
» హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డ జూపల్లి

హైదరాబాద్,ఏప్రిల్10 :
గత ప్రభుత్వ నాయకులకు సరైన ఆలోచన, అవగాహన లేక రాష్ట్రానికి తీవ్ర నష్టం చేశారని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. నీళ్లు లేని చోట మాత్రం పదేళ్లలో అనేక ప్రాజెక్టులు కట్టారని విమర్శించారు. కాళేశ్వరం ఇందుకు నిదర్శనమని అన్నారు. పలమూరులో పదేళ్లుగా ఒక్క పని చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ధనిక రాష్ట్రం అప్పగిస్తే, రూ.8 లక్షల కోట్లు ఎందుకు అప్పు చేశారని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు కాలువలకు ఇంకా అనుమతే రాలేదన్న జూపల్లి.. పాలమూరు ప్రాజెక్టుపై రాజకీయాలు చేస్తోంది మీరా? మేమా? అని నిలదీశారు.

2లో..

## సమ్మక్క-సారలమ్మ వర్సిటీ, ఐఐటీ హైదరాబాద్ మధ్య ఒప్పందం

హైదరాబాద్:
సమ్మక్క-సారలమ్మ గిరిజన వర్సిటీ- ఐఐటీ హైదరాబాద్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన ఒప్పంద కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర గిరిజన వర్సిటీని తొలుత మహబూబ్‌నగర్‌లో పెట్టాలనుకున్నామని, కానీ, కేంద్రం ములుగులోనే గిరిజన వర్సిటీని ఏర్పాటు చేస్తుందని అన్నారు."ఈ ఏడాది ప్రధాని మోదీ గిరిజన వర్సిటీ నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. రెండు కేంద్ర సంస్థలు ఈ వర్సిటీకి సహకారం అందిస్తాయి. సమ్మక్క-సారలమ్మ యూనివర్సిటీ భవిష్యత్‌లో గొప్ప అభివృద్ధి సాధిస్తుంది. గిరిజనులకు కావాల్సిన ఆధునిక సాంకేతికతను అందిస్తుంది. అబిడ్స్‌లో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేస్తున్నాం. గిరిజనుల సంక్షేమం కోసం కేంద్రం ఎంతో కృషి చేస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో కేంద్రం రూ.24వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది" అని కిషన్‌రెడ్డి అన్నారు.



## రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ ప్రమాణం

మొదటిపేజీ తరువాయి
అలాగే జెడియు నేత, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజరు కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జైరాం రమేష్, బిజెపి ఎంపి మాజీ కేంద్రమంత్రి అయిన రాజీవ్ ప్రతాప్ రూడీ తదితరులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్‌డిఎ తదుపరి బీహార్ సిఎం ఎవరనేది త్వరలోనే వెల్లడించనుంది. బహుశా ఏప్రిల్ 14న కొత్త ముఖ్యమంత్రిని ఎన్‌డిఎ ఎన్నుకునే అవకాశం ఉంది.

## ఏదుల రిజర్వాయర్ భూసేకరణ కోసం ఎంతో కష్టపడ్డా

మొదటిపేజీ తరువాయి
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాలమూరు-రంగారెడ్డిలో భాగమైన ఏదుల రిజర్వాయర్ భూసేకరణ కోసం నేనొక్కడినే 73 సార్లు వెళ్లి రైతులను కలిశానని గుర్తు చేశారు. ప్రతిసారి వెళ్లి రైతులతో ఓపికతో కూర్చొని రైతులకు నచ్చజెప్పాను. ఒక్కో సందర్భంలో రాత్రి 10 అయ్యేది అన్నారు. వలస పోయిన పాలమూరుకు నీళ్లు వస్తే బాగు పడుద్దని, రైతులకు విజ్ఞప్తి చేసి కాళ్లు మొక్కుతానని విజ్ఞప్తి చేసి భూసేకరణ చేయించానని పేర్కొన్నారు. అంత ఓపికగా కూర్చుంటే రైతులు భూములు ఇచ్చారు. అది వదిలేసి నేను భూములు తీసుకుంటా రైతులు ఏంత? వాళ్లు కూర్చొని ఏం చేస్తారు అని ఎమ్మెల్యే మేఘా రెడ్డి అంటే కుదరదు. ఆయన తాత వచ్చినా రైతుల భూములు లాక్కొని ప్రాజెక్ట్ కట్టలేరన్నారు. లగచర్లలో భూములు తీసుకుంటే రేవంత్ రెడ్డికే లాగులు తడిచేటట్లు చేశారు అక్కడి రైతులు. అలాగే రైతుల తరఫున బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాడుతామన్నారు.

# పిచ్చి వాగుడు వాగితే ఖబర్దార్

మొదటిపేజీ తరువాయి
అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీకి దక్కుతుందని ప్రశంసించారు. మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో అంగన్వాడీ టీచర్లకు మంత్రి సీతక్క స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. స్మార్ట్ ఫోన్లు పంపిణీ సందర్భంగా తనపై వస్తున్న ఆరోపణలను సీతక్క ఖండించారు. తనపై కొంతమంది పిచ్చి వాగుడు వాగుతున్నారని ఆగ్రహించారు. అసత్య ప్రచారాలతో అబద్దాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సెల్ ఫోన్ల కొనుగోలుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆన్ లైన్ టెండర్లు వేసిందని.. ఎక్కడా అవినీతి జరగలేదన్నారు. కేంద్రం ఇచ్చిన గైడ్ లైన్ల ద్వారా మాత్రమే రూ.11,600 తక్కువ రేటుతో సెల్ ఫోన్లు ఇస్తున్నామని పేర్కొన్నారు.తమ ప్రభుత్వం ఫోన్లు కొన్నది రూ.11 వేలకే అయితే రూ.14 వేలకు కొన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని ఆగ్రహించారు సీతక్క. పేదలకు మంచి చేసే తమ లాంటి వాళ్ల మీద చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్న వారికి లీగల్ నోటీసులు ఇస్తామని మంత్రి హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పని చేసినా గత ప్రభుత్వ పాలకులకు నిద్రపట్టడం లేదని విమర్శించారు. నిజాలు ఉంటే నిరూపించాలని, అంతేగాని బట్ట కాల్చి మీద వేస్తామంటే ఉరుకునే పరిస్థితి లేదని మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## పదేళ్లలో తెలంగాణను ఆగం చేశారు

మొదటిపేజీ తరువాయి
పాలమూరు ప్రాజెక్టును 80శాతం పూర్తి చేశామని అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. అబద్దాలతోనే పాలన చేశారని, ప్రజలను మోసం చేశారని అన్నారు. హరీష్ వ్యాఖ్యలపై మంత్రి మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 80 శాతం పూర్తయ్యాయని హరీశ్‌రావు చెబుతున్న మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. రూ.80 వేల కోట్ల అంచనా వ్యయం ఉన్న ప్రాజెక్టులో కేవలం రూ.25 వేల కోట్లు ఖర్చు చేసి 80 శాతం పనులు ఎలా పూర్తి చేశారని నిలదీశారు. కనీసం కాలువల నిర్మాణం పూర్తి చేయలేదని, భూసేకరణ చేపట్టలేదని, పరిపాలనా అనుమతులు కూడా లేవని విమర్శించారు. ఎన్నికల ముందు హడావుడిగా పంపులు ఆన్ చేసి ప్రజలను వంచించారు తప్ప, ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇచ్చారా? అని ప్రశ్నించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరుపై రూ. 7 వేల కోట్లు ఖర్చు చేస్తే, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు రూ. 8,300 కోట్లు వెచ్చించాయని గుర్తు చేశారు. గొల్లపల్లి రిజర్వాయర్ భూసేకరణలో భాగంగా 2.5 శాతం మంది రైతులకు మాత్రమే నష్టం వాటిల్లుతోందని... కానీ 97.5 శాతం మంది రైతులకు ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు.

## డిజిపి ఎదుట లొంగిపోయిన కేశాలు

మొదటిపేజీ తరువాయి
ములుగు, భూపాలపల్లి మీదుగా పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోతున్నట్లు ప్రకటించారు.అనంతరం సరిహద్దుల నుంచి పోలీసులు వీరిని వాహనాల్లో హైదరాబాద్‌కు తరలించారు. మావోయిస్టు నేత హిడ్మా గెరిల్లాను వదిలి దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీకి వెళ్లిన తర్వాత బెటాలియన్ బాధ్యతలను బడ్సే దేవాకు, కేశాలుకు అప్పగించారు. అయితే, కొన్ని రోజులు కిందటే కమాండర్ దేవా.. తెలంగాణ పోలీసుల ఎదుట లొంగుపోయారు. ఆ తర్వాత బెటాలియన్ బాధ్యతలు నిర్వహిస్తున్న సోడిమల్ల కేశాలు సైతం తాజాగా శుక్రవారం లొంగిపోయారు. ఇతనికి సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ వంటి పేర్లున్నాయి. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు.మొత్తం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోయినట్లు తెలిపారు. వీరిలో గెరిల్లా బెటాలియన్ కమాండర్ సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ ఉన్నారని వెల్లడించారు. తెలంగాణ పోలీసుల ఎదుట ఆయుధాలు, బంగారంతో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసినట్లు చెప్పారు. 36 తుపాకులు, ఐదు ఏకే 47లు, నాలుగు ఎస్ఎల్ఆర్‌లు, 1,007 తూటాలతో పోలీసులు ముందు మావోలు లొంగిపోయినట్లు పేర్కొన్నారు. అలాగే 800 గ్రాముల బంగారం సైతం అప్పగించినట్లు వెల్లడించారు. వీరి లొంగుబాటుతో అత్యంత కీలకమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ పూర్తిగా కనుమరుగైనట్లు డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించారు.గత ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా డీజీపీ ఎదుట లొంగిపోయారు. వీరిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ కేశాలు కూడా ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ పెరగడంతో మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయించారు. లొంగిపోయిన వారిలో ఒక్కరు మాత్రమే తెలంగాణకు చెందివారు కాగా.. ఎక్కువమంది ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే. 'లొంగిపోయిన వారికి పునరావాస ప్యాకేజీ కింద రూ.1.93 కోట్లు అందజేస్తున్నాం. సీఎం ఆదేశాల మేరకు ఆరోగ్యకార్డులు అందజేస్తాం. తెలంగాణకు చెందిన వాళ్లు సెంట్రల్ కమిటీలో 11 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరున్నారు. స్టేట్ కమిటీలో తెలంగాణ వాళ్లు 24 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరే ఉన్నారు. వాళ్లు కూడా లొంగిపోవాలని పిలుపునిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు.

# కాళేశ్వరాన్ని రెండేళ్లుగా ఎందుకు నానబెట్టారు

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ..కమిషన్ల కోసమే ఇప్పుడు కాళేశ్వరానికి మరమ్మతులు అంటున్నారని మండిపడ్డారు. మున్సిపల్, అర్బన్ ఫారెస్ట్రీలో తీవ్రమైన అవినీతి జరుగుతోందన్నారు. రియల్ ఎస్టేట్ కోసం ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్‌కు నష్టం చేయవద్దని కోరారు. అలాగే జీహెచ్ఎంసీలో తీవ్ర అవినీతి జరుగుతోందని కవిత ఆరోపించారు. అనేక గ్రామాలు జీహెచ్ఎంసీ పరిధిలో కలిసినా సరైన అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. హెచ్ఎండీఏ పరిధిలో 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ అభివృద్ధికి ఉపయోగించలేదని కవిత ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. 2017 నుంచి 2021 వరకు 480 కోట్ల రూపాయల పనులను నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత మరో 1,140 కోట్ల రూపాయలను అదే పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని వెల్లడించారు. ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. రూ.50 కోట్ల టెండర్ వేస్తే దాదాపు 50 శాతం తిరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని.. కానీ నామినేషన్ పద్ధతిలో ఇలాంటి లాభం లేకపోవడం అవినీతికి దారితీస్తోందని ఆరోపించారు. నర్సరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న 6 వేల మంది స్కిల్డ్ లేబర్‌కు 23,800 రూపాయలు ఇవ్వాల్సి ఉందని కవిత తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ఒక కంపెనీపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ వేయించారని.. తర్వాత ఏమైందో తెలియాలని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డులో గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్టును రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక కూడా కొనసాగిస్తున్నారని విమర్శించారు. దీనిపై ఆరోపణలు చేసిన రేవంత్ దీనిని ఎలా కొనసాగిస్తారని అన్నారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌పై ముఖ్యమంత్రి దృష్టి పెడుతున్నారని.. సీఎం దగ్గర బ్యాగులు మోసే వ్యక్తి చెప్పినట్టు మాత్రమే పనులు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. జీహెచ్ఎంసీ అంటే గుంపు మేస్త్రి పాలనలో జరుగుతున్న మహా అవినీతి అని వ్యాఖ్యానించారు. అవినీతి కోసమే సీఎం 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారని కవిత అన్నారు. నెల 25వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. 500 మంది వలంటీర్లు సేవలు అందిస్తారని తెలిపారు. మహిళా బిల్లు అమలు కాకపోవడంతో 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు నష్టపోయారని చెప్పారు. 2027 జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. ధర్మపురి అరవింద్‌లో పురుష అహంకారం కనిపిస్తోందని.. ప్రజలు ఆయన్ను ఎప్పుడో మర్చిపోయారని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నాను... ఎవరో చెప్తే పార్టీ పెట్టే స్థాయిలో లేను' అని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను కేరళం ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తాము వీడియో రిలీజ్ చేశామని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

# తిరోగమనంలో కాంగ్రెస్ పార్టీ

## తెలంగాణపై పట్టు కోల్పోయిన అధిష్ఠానం

- రేవంత్ చెప్పు చేతల్లో పిసిసి బందీ
- పదవుల కోసం అయితే అధికార పార్టీ వీడుతానా
- మీడియాతో జీవన్ రెడ్డి వెల్లడి

మాజీ సీఎం కేసీఆర్‌తో భేటీ అనంతరం మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణపై పట్టు కోల్పోయిందని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు పీసీసీ చెప్పినట్లు సీఎం నడుచుకునేవారని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిందే పీసీసీ అమలు చేస్తోందని అన్నారు. కేసీఆర్‌తో దాదాపు 5 గంటలపాటు జీవన్‌రెడ్డి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తన విషయంలో పీసీసీ తప్పు చేసి.. ఆ నింద ఏఐసీసీపై వేస్తోందన్నారు. నాకు 14 సార్లు బీ ఫామ్ ఇచ్చారంటే.. అది నా సమర్థతతోనే. కాంగ్రెస్ పార్టీ తిరోగమనంలో పయనిస్తోంది. కాంగ్రెస్ పోవాలి.. కేసీఆర్ రావాలి అని ప్రజల్లో చర్చ మొదలైంది. త్వరలో జగిత్యాలలో సభపెట్టి బీఆర్ఎస్‌లో చేరతానని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమైన టి.జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని కడిగిపారేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణపై పట్టు కోల్పోయిందని పేర్కొన్న ఆయన మోసపూరిత కాంగ్రెస్ పోవాలని, కేసీఆర్ మళ్లీ రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ తిరోగమనంలో పయనిస్తోందని జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కేసీఆర్‌తో భేటీ అయిన జీవన్ రెడ్డి ఏప్రిల్ 20న పార్టీలో చేరుతున్నానని ప్రకటించారు. కొన్నాళ్లుగా పార్టీలో జరుగుతున్న పరిణామాలతో కలత చెందాను. అందుకే.. బీఆర్ఎస్‌లో చేరి కేసీఆర్‌తో కలిసి పని చేయాలనుకుంటున్నా. నేను అధికార పార్టీలోకి వెళ్ళట్లేదు. రెండేళ్లలో 3 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు, ఇచ్చింది 17 వేల ఉద్యోగాలు. మొదటి సంవత్సరం 2 లక్షల ఉద్యోగాలు అని అన్నారు.. రెండో సంవత్సరం 1 లక్ష ఉద్యోగాలు అని అన్నారు, ఏమైంది?' అని జీవన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. పదవుల కోసమే బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లాలంటే తాను ఆరోజే వెళ్ళేవాడినని, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చనందుకు, ప్రజల పక్షాన పోరాడేందుకు తాను బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లేందుకు నిర్ణయించుకున్నానని జీవన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్‌తో 20 ఏళ్లకుపైగా అనుబంధాన్ని తెంచుకున్న జీవన్ రెడ్డి శుక్రవారం కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. తన బృందంతో కలిసి వచ్చిన జీవన్ రెడ్డికి గులబీ బాస్ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. జీవన్ రెడ్డి బృందంతో కలిసి లంచ్ చేసిన కేసీఆర్ అనంతరం.. పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డికి పార్టీలో సముచిత ప్రాధాన్యం ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా రావాలని జీవన్ రెడ్డి ఆహ్వానించగా గులాబీ అధినేత సానుకూలంగా స్పందించారని సమాచారం. అధికార పార్టీ నుంచి ప్రతిపక్షంలోకి ఎందుకు వెళ్తున్నానో మీకే తెలియాలంటూ కాంగ్రెస్ నేతలకు చురకలు అంటించారు.మిగిలిన రెండున్నరేళ్లు అయినా కాంగ్రెస్ సర్కార్ బాగా పని చేయాలని తాను కోరుకుంటున్నట్లు జీవన్ రెడ్డి చెప్పారు.

# మావిగన్ పై ఐదేళ్లలో ఎందుకు మాట్లాడలేదు

- అప్పుడు మూడు రాజధానులని ఎందుకు అన్నారు
- ఐదేళ్లలో రాజధాని కోసం ఒక్క ఇటుకైనా పేర్చారా
- ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం మొదలు పెట్టారు
- పులివెందులకు అవి గొడ్డలి పేరు పెట్టాలి
- అమ్మ విజయమ్మకు బొత్స బహిరంగ క్షమాపణలు చెప్పాలి
- మీడియా ముందు జగన్‌ను ఏకి పారేసిన వైఎస్ షర్మిల

ఏపీ రాజధాని అమరావతికి జగన్ పేరుతో 'మావిగన్' సరే.. పులివెందులకు అవినాశ్ పేరుతో ' అవి గొడ్డలి' అని పెట్టాల్సిందని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఎద్దేవా చేశారు. జగన్ పేరులో గన్ ఉందని, అవినాశ్ పేరులో వినాశనం ఉందన్నారు. ' ఎంతసేపూ నరకాలి.. చంపాలి.. నాశనం చేయాలి' ఇదే వైకాపా సిద్ధాంతమని మండిపడ్డారు. నిండు సభలో విజయమ్మను అవమానించినందుకు బొత్స ఎంత ఏడ్చినా తక్కువేనన్నారు. మావిగన్.. ఎంతసేపూ గన్‌లు, గొడ్డళ్లేనా? ఐదేళ్లలో రాజధాని కోసం ఒక్క ఇటుక కూడా పెట్టలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదిక కూల్చారు. ఇప్పుడు అమరావతి వద్దట.. మావిగన్ పెడతారట. పులివెందుల పేరు బదులు 'అవి గొడ్డలి' అని పెట్టండి. మావిగన్ అద్భుత ఆలోచనైతే.. ఐదేళ్లు అధికారంలో ఉండి ఎందుకు అమలు చేయలేదు. మావిగన్‌కు తక్కువ ఖర్చు అయితే.. మూడు రాజధానులు ఎందుకన్నారు? జగన్ ఐదేళ్లు నిద్రపోయారా? మావిగన్ మీద మా వైఖరి అడుగుతున్నారు. ఎవరైనా జోక్ వింటే బిగ్గరగా నవ్వుతారు.. మా నవ్వే 'మావిగన్' మీదున్న అర్థం. అమరావతిపై కాంగ్రెస్ వైఖరి ఇప్పటికే స్పష్టంగా చెప్పాం. పార్లమెంట్‌లోనూ మద్దతిచ్చాం. అమరావతి కట్టడం కేంద్రం బాధ్యత అని చెప్పాం. విభజన హామీలు నెరవేర్చాలని చెప్పాం. అమరావతికి పూర్తి మద్దతిస్తున్నాం. నన్ను కూటమికి దత్తపుత్రిక అంటున్నారు. పచ్చకామెర్లు వచ్చినవాడికి లోకమంతా పచ్చగా ఉంటుందట. జగన్ మాత్రం భాజపాకి దత్తపుత్రుడు. ఆయన మోదీతో అక్రమ పొత్తు పెట్టుకున్నారు. వీళ్లు అలా చేశారు కాబట్టి.. అందరూ అలాగే ఉంటారనుకోవడం పొరపాటు. మేం వైఎస్సార్ ఐడియాలజీకి నిజమైన వారసులం. వైఎస్సార్ పేరు వాడుకునే హక్కు ఎవరికీ లేదు. ప్రజల పక్షాన పోరాటం చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని అన్నారు. తన కన్నతల్లి వైఎస్ విజయమ్మకు శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. గతంలో నిండు అసెంబ్లీలో తన తల్లి వైఎస్ విజయమ్మను బొత్స సత్యనారాయణ అవమానించారని తెలిపారు. తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని నాడు చులకన చేసి మాట్లాడి.. విజయమ్మను నిండు సభలో ఆయన కంటతడి పెట్టించారని చెప్పారు. ఆ తర్వాత విజయమ్మ ఇంటికి వచ్చి చాలా బాధపడ్డారని వైఎస్ షర్మిల గుర్తు చేసుకున్నారు. అమ్మను ఇంతగా బాధపెట్టిన బొత్స సత్యనారాయణకు ఇలా జరగాల్సిందేనని పేర్కొన్నారు. నిండు సభలో విజయమ్మను అవమానించినందుకు బొత్స ఎంత ఏడ్చినా తక్కువే అని అన్నారు. శుక్రవారం అనంతపురంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కొనసాగించాలని కోరుతూ సీపీఐ పాదయాత్ర చేపట్టింది. ఈ పాదయాత్రకు కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపింది. ఈ పాదయాత్రలో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల పాల్గొన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుతో ఏనాడూ అక్రమ పొత్తు పెట్టుకునే పరిస్థితి తమకు లేదని కుండ బద్దలు కొట్టారు. తమది కాంగ్రెస్ పార్టీ అని.. ఇది వైఎస్ఆర్ లెగసీతో ఉన్న పార్టీ అని గుర్తు చేశారు. వైఎస్ఆర్ ఐడియాలజీతోపాటు ఆయన లెగసీని తాము మోస్తున్నామన్నారు. మీలాగ మత పిచ్చి బీజేపీకి మద్దతు ఇస్తున్న వాళ్లం తాము కాదని చెప్పారు. వైఎస్ఆర్ ఐడియాలజీకి నిజమైన వారసులం తామేనని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన పోరాటం చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల స్పష్టం చేశారు.

## 20న జగిత్యాలలో భారీ బహిరంగ సభ

- ముఖ్య అతిథిగా హాజరు కానున్న కెసిఆర్
- కెసిఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోనున్న జీవన్
- మాజీమంత్రులు కొప్పుల, ఎల్. రమణల వెల్లడి

కాంగ్రెస్‌ను వీడిన టి.జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం ఖాయమైంది. శుక్రవారం ఎర్రవల్లిలో గులాబీ అధినేత కేసీఆర్ ను కలిసిని జీవన్ రెడ్డి ఏప్రిల్ 20వ తేదీన పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారు. కేసీఆర్ సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకోనున్నారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరుతున్నందున జగిత్యాలలో తమ ప్రాబల్యాన్ని చాటేందుకు భారీ బహిరంగ సభ నిర్వహించాలని పార్టీ భావిస్తోంది. ఈ సమావేశానికి ప్రత్యేక అతిథిగా రావాల్సిందిగా కేసీఆర్‌ను జీవన్ రెడ్డి ఆహ్వానించారు. కాంగ్రెస్‌తో 20 ఏళ్లకుపైగా అనుబంధాన్ని తెంచుకున్న జీవన్ రెడ్డి శుక్రవారం కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. తన బృందంతో కలిసి వచ్చిన జీవన్ రెడ్డికి గులబీ బాస్ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. జీవన్ రెడ్డి బృందంతో కలిసి లంచ్ చేసిన కేసీఆర్ అనంతరం.. పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డికి పార్టీలో సముచిత ప్రాధాన్యం ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా రావాలని జీవన్ రెడ్డి ఆహ్వానించగా గులాబీ అధినేత సానుకూలంగా స్పందించారని సమాచారం. బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు టి. జీవన్ రెడ్డికి ముహూర్తం ఖరారు అయింది. ఏప్రిల్ 20వ తేదీన జగిత్యాల వేదికగా బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభ నిర్వహిస్తుందని ఆ పార్టీ నేత కొప్పుల ఈశ్వర్ వెల్లడించారు. ఈ సభలో బీఆర్ఎస్ పార్టీలో జీవన్ రెడ్డి చేరతారని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌తో కొప్పుల ఈశ్వర్, ఎల్ రమణ సమావేశమయ్యారు. అనంతరం వీరు విలేకర్లతో మాట్లాడుతూ.. కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో జీవన్ రెడ్డి చేరతారని తెలిపారు. ఈ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు శనివారం జగిత్యాలలో స్థలాన్ని పరిశీలిస్తామని ఆయన చెప్పారు. రాష్ట్రంలో రైతు సమస్యలతో పాటు ప్రజా సమస్యలపై ఈ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు వివరించారు. బీఆర్ఎస్ ప్లీనరీ సభకి ముందే పార్టీలో చేరికలు ఉంటాయన్నారు. కేసీఆర్‌తో కలిసి పని చేయడానికి జీవన్ రెడ్డి ముందుకు వచ్చారని చెప్పారు. పార్టీలో తగిన ప్రాధాన్యత ఇస్తామని జీవన్ రెడ్డికి కేసీఆర్ హామీ ఇచ్చారని ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. ప్రజాక్షేత్రంలోకి రానున్నారని ఆ పార్టీ నేత ఎల్.రమణ వెల్లడించారు. ప్రజా సమస్యలపై ఇకపై నిరంతరంగా పోరాటం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఇకపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడతామని ఎల్ రమణ తెలిపారు.

## పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై కాంగ్రెస్ ఫోకస్

మొదటిపేజీ తరువాయి
అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, భారతదేశంపై వాటి ప్రభావం, భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై చర్చించారు. కేవలం మూడు రోజుల పాటు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోయే బిల్లులను ఎలా అడ్డుకోవాలి లేదా చర్చలో ఎలా పైచేయి సాధించాలనే అంశంపై సభ్యులకు కాంగ్రెస్ అగ్రనేతలు దిశానిర్దేశం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నరేంద్రమోదీ ప్రభుత్వం అనూహ్యంగా ప్రత్యేక సమావేశాలను పిలవడంతో ఈ అచిఅ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా తెలంగాణ వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పార్టీ బలోపేతంపై సీఎం రేవంత్‌రెడ్డి సీడబ్ల్యూసీ సమావేశంలో కీలక ప్రసంగం చేసే అవకాశం ఉంది. సీడబ్ల్యూసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఎన్నికల ప్రయోజనాల కోసమేనని చెప్పారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రతిపాదన కాంగ్రెస్ ముందుకు రాలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలోనే మహిళా రిజర్వేషన్లపై స్పష్టతని ఇచ్చామని, కేంద్రాన్ని డిమాండ్ కూడా చేశామని ప్రస్తావించారు. వెస్ట్ బెంగాల్, తమిళనాడు ఎన్నికలు జరుగుతున్న వేళ హఠాత్తుగా మహిళా రిజర్వేషన్ల బిల్లు సవరణ , పునర్విభజన చట్టం సవరణ బిల్లులను తెరపైకి తీసుకువచ్చారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక అఖిలపక్ష సమావేశం పెట్టాలని పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీలన్నీ కోరాయని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం తమ ప్రయోజనాల కోసం ప్రయత్నం చేస్తుందని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

# జైత్రయాత్ర నుండి శూన్యయాత్ర వరకు

## నక్సలిజం షష్టిపూర్తి ..ముగిసిన సాయుధ ప్రయోగం

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

**■ నక్సలిజానికి షష్టిపూర్తి జరిగింది మావోయిస్టు నక్సలిజం గురించి మాట్లాడడానికి ముందు షష్టిపూర్తి అంటే ఏమిటో తెలుసుకోవాలి.**

భారతదేశంలో ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లో నక్సలిజం గురించి ఎవ్వరికీ ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.మావోయిస్టు పార్టీగా రూపాంతరం చెంది అయోమయాన్ని ఆవేదనను మిగిల్చి శూన్యంలోకి ప్రవేశించిన అర్థం లేని నక్సలైట్ సాయుధ పోరాటం ముగిసింది.మావోయిస్టు పార్టీ కార్యదర్శి శ్రీ తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ ని పోలీసులు అరెస్ట్ చేశారా! అతను ఆత్మ సమర్పణ చేసుకున్నాడా! అన్న చర్చ ప్రధానం కాదు.

**■ 2026 మార్చ్ 31 తో కగార్ ఆపరేషన్ గడువు ముగిసింది**

మావోయిస్టు సాయుధ పోరాటంలో చాలామంది అగ్రశ్రేణి నాయకులు సరెండర్ అయ్యారు. లేదా చనిపోయారు. కొందరు ఇంకా ఆచూకీ తెలియని స్థితిలో ఉన్నారు. ఈ మొత్తం ఆపరేషన్ ముగిసే సమయానికి దేవ్ జీ మావోయిస్టు ఉద్యమానికి నాయకుడిగా ప్రచారం జరిగింది కాబట్టి ఇక్కడ మనం దేవ్ జీ ని మావోయిస్టు ఉద్యమ నాయకత్వ సంకేతంగా తీసుకుంటున్నాము.

**■ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ ముగిసింది. మావోయిస్టు నక్సలైట్ల సాయుధ పోరాటము ముగిసింది**

తిప్పిరి తిరుపతి ఏ దేవ్ జీ ఫిబ్రవరి 25 2026 న తెలంగాణ రాష్ట్ర పోలీసుల మందు జరిపిన సరెండర్ ఉరఫ్ అరెస్ట్ తో అందరి మదిలో రకరకాల భావాల సమీక్ష జరుగుతున్నది.

మావోయిస్టు ఉద్యమాన్ని భారతీయ కాలగణన "షష్టి పూర్తి చక్రం"తో కలిపి మాట్లాడుకుందాం.

**■ హిందూ క్యాలెండర్‌లో 60 సంవత్సరాల షష్టి వత్సర చక్రం ఉంటుంది.**
**ప్రభావం నామ సంవత్సరం నుండి అక్షయ నామ సంవత్సరం వరకు మొత్తం 60 సంవత్సరాలు ఉంటాయి. ఈ కాలచక్రం సంపూర్ణంగా శాస్త్రీయమైనది.బృహస్పతి ఒక రాశి నుండి మరో రాశికి మారడానికి సుమారు 1 సంవత్సరం పడుతుంది.బృహస్పతి అంటే గురువు 12 రాశులు చుట్టిరావడానికి 12 సంవత్సరాలు పడుతుంది. ఇటువంటి 5 చక్రాలు కలిస్తే 60 ఏళ్లు. దీనిని ఒక పూర్తి చక్రంగా భావిస్తారు**


**■ ఒక మనిషి జీవితం,ఒక ఆలోచన,ఒక సిద్ధాంతం గానీ 60 ఏళ్లలో రకరకాల పరీక్షలకు గురవుతుంది.సంపూర్ణమవుతుంది**

మంచైనా చెడైనా ఒక సిద్ధాంతం,ఒక జీవితం,ఒక ఆచరణ యొక్క నాణ్యత .. 60 ఏళ్లలో తన వ్యక్తిత్వాన్ని, ఫలితాన్ని చూపిస్తుంది.ఆ లెక్కన భారత సామాజిక వ్యవస్థలో 60 ఏళ్ల నక్సలిజం ఒక విఫల సిద్ధాంతంగా నిలిచింది.నక్సలైట్ల ఆవేదనలో, ఆవేశంలో సహృదయత ఉంది.కానీ నక్సలైట్ల సిద్ధాంతం ఆదర్శం కాదని కాలం నిరూపించింది.

**■ నక్సలైట్ ఉద్యమానికి హృదయం ఉంది. కానీ మెదడు లేదు.. అని పాశం యాదగిరి లాంటి సీనియర్ జర్నలిస్ట్ అన్న మాట అక్షర సత్యం**

నక్సలైట్లు తమ కార్యక్రమాన్ని ఎప్పుడు ఎత్తుగడలతోని మాత్రమే నడిపించారు. నక్సలిజం ఒక పరిపూర్ణ సిద్ధాంతంగా,ప్రత్యామ్నాయ సామాజిక వ్యవస్థగా నిరూపించబడలేదు. భూస్వాములకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ లోని సిలిగురి లో ప్రారంభమైన సాయుధ ప్రతిఘటనకు సిద్ధాంతాన్ని జోడించి ఒక ప్రయోగం జరిగింది.
చారు మజుందార్ 1965–67 మధ్య రాసిన ప్రసిద్ధ "చారిత్రక ఎనిమిది పత్రాలు..Historic Eight Documents" భారత నక్సల్బరీ ఉద్యమానికి, విప్లవ కమ్యూనిస్ట్ సిద్ధాంతానికి పునాదులుగా పరిగణించబడతాయి. 1965 నుండి 1967 మధ్యకాలంలో రివిజనిజానికి, సవరణవాదానికి వ్యతిరేకంగా, సాయుధ పోరాటాన్ని ప్రోత్సహిస్తూ ఈ పత్రాలను రూపొందించారు.
సాయుధ ప్రతిఘటన "వర్గ శత్రు నిర్మూలన"గా మొదలయ్యి చివరికి "సాయుధ పోరాటం" అంటూ చిందులు వేసింది.

**■ భారతదేశంలో జరిగిన రైతాంగ చైతన్యానికి చైనా కమ్యూనిస్ట్ నాయకుడు మావో ఆదర్శంగా నిలిచాడు. నిలిచాడు**




**అనేకంటే నిలిపారు అనడం కరెక్ట్**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ ఉద్యమాన్ని విస్తరించడంలో దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి, మరియు కొల్లా వెంకటయ్య వంటి సీపీఎం నాయకులు ముఖ్యులు.శ్రీకాకుళంలో మొదలైన సాయుధ నక్సలిజం వరంగల్ జిల్లా కరీంనగర్ జిల్లా, ఆదిలాబాద్ జిల్లా తో పాటు సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో "పీపుల్స్ వార్" పార్టీగా ముద్ర వేసుకున్నది.ఆదిలాబాద్ జిల్లా తపాలాపూర్ లో భూస్వామి పితాంబర్ రావు కుటుంబాన్ని చంపి, కరీంనగర్ జిల్లాలోని చిన్న మెట్టుపల్లి భూస్వామి జగన్ మోహన్ రావును చంపి పీపుల్స్ వార్ ఒక సంచలన ఉద్యమం గా మారింది. "హంగ్రీ సిక్స్టీస్" గా పేరుపొందిన 1960 దశకంలో ప్రారంభమైన ఈ నక్సలైట్ ఉద్యమం యువతను ఆకర్షించింది. హంగ్రీ సిక్స్టీస్ అంటే ఒక ఆకలి కాలం. నిరుద్యోగం తాండవించిన ఆకలి యుగం.

**■ 1967 సంవత్సరములో నక్సల్ బరి లో పుట్టిన సాయుధ ప్రతిఘటన శ్రీకాకుళముకు చేరి,అక్కడి నుండి తెలంగాణకు వచ్చి జగిత్యాల లో 1978 సంవత్సరంలో "జైత్ర యాత్ర"గా రూపుదిద్దుకున్నది**

కొండపల్లి సీతారామయ్య, కె.జి.సత్యమూర్తి లాంటి వారి సాయుధ సిద్ధాంత ప్రతిపాదలతో కలిసిన వారు చాలామంది.. నక్సలైట్ల ఆయుధానికి అభిమానులుగా మారిపోయారు.

**■ ప్రజావిముక్తి అనే ఉదాత్త ఆశయం ఆయుధానికి బలైపోయింది**

**కొండపల్లి సీతారామయ్య ప్రారంభించిన ఉద్యమం గణపతి నుండి దేవ్ జీ వరకు 60 ఏళ్ళు ప్రయాణించింది.**

గణపతి, మల్లోజుల, ఆదిరెడ్డి,రాజిరెడ్డి లాంటి ఎందరెందరో సహృదయులు తమ జీవితాలను ఈ పోరాటానికి అంకితం చేశారు. జగిత్యాల జైత్ర యాత్రతో స్ఫూర్తిని పొందిన దేవ్ జీ కూడా తన లేత ప్రాయంలోనే సాయుధ పోరాట ఆశయానికి అంకితమై మన కళ్ళ ముందు ఈ ఉద్యమంతో కలిసి పయనించాడు, జీవించాడు.

**■ మన కళ్ళ ముందే దేవ్ జీ తన సాయిధ పోరును విరమించాడు. దేవ్ జీ జీవిత ప్రయాణం మావోయిస్టు నక్సలైట్ల మొత్తం చరిత్ర కు సజీవ సాక్ష్యం**

సాయుధ పోరును విరమించినప్పటికీ మావోయిస్టు ఉద్యమం వివిధ రూపాలలో కొనసాగుతూనే ఉంటుందని దేవ్ జీ అంటున్నారు.

**■ ఆయుధం లేని మావోయిజం ఇప్పుడు ఏమి చేస్తుంది?**

సాయుధ పోరు విరమించిన మావోయిజం ప్రత్యామ్నాయ ఉద్యమ కార్యక్రమాన్ని రూపొందించుకొని పనిచేస్తుందని దేవ్ జీ అన్నారు.ఇన్నాళ్ళ తమ సాయుధ పోరాటము విఫలమైందని దేవ్ జీ అంగీకరించినట్టే అని అందరి భావన.60 ఏళ్ల మావోయిస్టుల సాయుధ పోరు ఒక విఫల ప్రయోగం అని అధికారిక ఆమోదం ముద్ర వేసినట్టే.

**■ ఈ వ్యక్తీకరణతో మొత్తం మావోయిస్టు ఉద్యమ అయోమయానికి దేవ్ జీ ఒక ఉదాహరణగా,ఒక సంకేతంగా నిలిచాడు**

**■ దేవ్ జీ సాయుధ పోరు విరమణ సందర్భం మావోయిస్టుల సంకల్పం బలమైనది.మావోయిస్టుల సహృదయ ఆశయం,పోరాటం గౌరవనీయమైనది. కానీ ఆ పోరాటం ఆదర్శం కాదని చరిత్ర నిరూపించింది**

షష్టి పూర్తి చక్రం పూర్తయింది.కాల పరీక్ష కూడా పూర్తయింది.

ఈ మావోయిస్టు ఉద్యమంలో వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. సోను దాదా, ఆశన్న,రాజిరెడ్డి లాంటి ఎందరు ప్రముఖులు సరెండర్ అయినా.. మావోయిస్టు పార్టీ అగ్రనేతగా దేవ్ జీ సరెండర్ మాత్రమే సాంకేతిక ప్రమాణం అవుతుంది.ఎందుకంటే అతడు మావోయిస్టు ఉద్యమ సారథి కాబట్టి.మావోయిస్ట్ పోరాటానికి దేవ్ జీ చివరి నాయకుడిగా ప్రచారం జరిగింది కాబట్టి.చట్టం, రాజ్యాంగం అంటూ హక్కుల గురించి మాట్లాడే నక్సలైట్లు ఎప్పుడు కూడా భారత రాజ్యాంగాన్ని గౌరవించలేదు.భారత రాజ్యాంగాన్ని కూల దోసి... కార్మిక వర్గ శ్రేయో రాజ్యం స్థాపించాలని పోరాటం చేసిన మావోయిస్టు నక్సలైట్లు అంబేద్కర్ వ్రాసిన భారత రాజ్యాంగాన్ని ఎప్పుడు ఆచరించలేదు, అనుసరించలేదు.

**■ మావోయిజం "మాయామశ్చీంద్ర" గా మారింది**

సమాజంలో పేరుకుపోయిన కుళ్ళును ప్రక్షాళన చేసి ఆరోగ్య సమాజంగా మార్చడానికి స్వయంగా శివుడు భూమిపైకి సామాన్య మానవుడిగా వచ్చి "మశ్చీంద్రుడు" గా సమాజంలో పనిచేస్తుంటాడు.సమాజాన్ని మార్చడం పక్కన బెట్టి సాక్షాత్తూ పరమేశ్వరుడు సమాజ బలహీనతలకు లోనవుతాడు.రంభతో కలిసి కాపురం చేసి పిల్లలను కూడా కంటాడు.చివరికి పరమేశ్వరుడు తన అవతార విశేషాలు కూడా మరచిపోయేటంతగా ఈ మాయలో పడిపోతాడు.

**■ సమాజాన్ని మార్చడానికి వచ్చిన పరమేశ్వరుడు చివరికి తనే మారిపోతాడు. దీనినే చరిత్ర "మాయా మశ్చీంద్ర" అవతారం అంటారు**

**■ మావోయిస్టులు కూడా సమాజాన్ని మార్చడానికని బయలుదేరి చివరికి తామే మారిపోయారు. తమ సాయుధ పోరాటం ఎందుకో తెలియని అయోమయానికి గురయ్యారు**

**■ మావోయిస్టులు కమ్యూనిస్టులు వారి ఉద్యమ పరిణామాన్ని రకరకాల పదజాలంతో వర్ణిస్తారు.కమ్యూనిస్టుల ఈ పద ప్రయోగాలు జనానికి ఇప్పటికీ అర్థం కావు**

**■ 60 ఏళ్ల సాయిధ పోరాటాన్ని విరమించి, రాజకీయ రూపం తీసుకుంటామని ఇప్పుడు దేవ్ జీ నోటి ద్వారా వినడం ఆశ్చర్యం గొలుపుతున్నది**

•• Left wing extremism, left wing adventurism is an infantal disorder ••

**■ వామపక్ష తీవ్రవాదం, వామపక్ష సాహస ఆచరణ ఒక బాలారిష్ట రుగ్మత ..అని స్వయంగా లెనిన్ 1920 లో "లెఫ్ట్ వింగ్ కమ్యూనిజం" అనే పుస్తకములో వ్రాశాడు**

ముఖ్యంగా జర్మనీ, బ్రిటన్, హాలండ్ వామపక్ష విప్లవ కార్యాచరణను వ్యతిరేకిస్తూ విమర్శిస్తాడు. సంప్రదాయ రాజకీయ కార్యక్రమాలను కాదని, పార్లమెంటరీ రాజకీయ కార్యాచరణలలో, ట్రేడ్ యూనియన్లలో అతివాద కార్యాచరణను అమలు చేస్తున్న కమ్యూనిస్టులను తీవ్రంగా నిరసించాడు.

**■ ప్రజలకు అర్థం కాని నక్సలైట్ల ఆయుధ భాష**

సామాజిక కార్యం చాలా సంక్లిష్టమైనటువంటిది. సమాజంలోని చెడును తొలగించడానికి లేదా తారతమ్యాలు రూపుమాపడానికి ఆయుధం ఒక్కటే సరియైన మందు అని తుపాకిని నమ్ముకున్న నక్సలైట్ మావోయిస్టు లు ఇప్పుడు ఏమి మాట్లాడాలో తెలియని గందరగోళానికి గురయ్యారు.వర్గ శత్రు నిర్మూలన, సాయుధ పోరు అనే కార్యాచరణ గురించి 1996 సంవత్సరం నుండే మావోయిస్టులలో అంతర్మధనం ప్రారంభమైంది.ఒకనాడు ఎన్నికల బహిష్కరణ అంటూ పార్లమెంటరీ ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియను వ్యతిరేకించి ఉద్యమాలు నడిపిన నక్సలైట్లు.. ఇప్పుడు,ప్రజా సమస్యల పరిష్కారానికి రాజకీయ కార్యాచరణ లోకి వస్తామని, పోరాట రూపం మార్చుకుంటామని అనడం,మనం వినడం ఒక బాధాకర పరిణామం."ఎన్నికల బహిష్కరణ పిలుపు" కాలంలో ఎందరో రాజకీయ పార్టీ కార్యకర్తలను చంపిన నక్సలైట్లు తమ ప్రత్యర్థి పార్టీల ప్రచార సామాగ్రిని, ప్రచార వాహనాలను దగ్ధం చేసిన చరిత్ర అందరికీ తెలుసు.ఇప్పుడు మావోయిస్టు నక్సలైట్లు మేము సాయుధ పోరు విరమిస్తున్నాము, ప్రజాక్షేత్రంలో ప్రజా సమస్యల కొరకు పాటుపడతాము అని అంటున్నారు. పార్లమెంటరీ ఎన్నికల రాజకీయాలను వ్యతిరేకించిన మావోయిస్టు నక్సలైట్లు ఇప్పుడు కొత్త రూపంతో రాజకీయాల్లో పనిచేస్తామంటున్నారు.60 ఏళ్ల సాయిధ పోరాటం తరువాత ఇప్పుడు మావోయిస్టు నక్సలైట్లకు తత్వం బోధపడిందా? లేక తమ సైదాంతిక ఆచరణ తప్పు అని ఒప్పుకుంటున్నారా?..మావోయిస్టు నక్సలైట్లు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా కాలం తనకు కావాల్సింది సృష్టించుకుంటూ అడ్డంకులు తొలగించుకుంటూ సాగుతూనే ఉంటుంది.
కేంద్ర ప్రభుత్వం, మావోయిస్టుల సాయుధ పోరాటాన్ని తుద ముట్టించడానికి చేపట్టిన ఆపరేషన్ కగార్ తో దండకారణ్యంలో సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్న మావోయిస్టుల "జనతన సర్కార్" ను కూల్చింది. మొత్తం భారతదేశాన్ని అంబేద్కర్ కలలుగన్న పార్లమెంటరీ ప్రజాస్వామ్య బాటలోకి మళ్లించడానికి కృషి చేస్తున్నది.
గణపతి లాంటి సీనియర్ మావోయిస్టు నాయకులు ఒకరిద్దరు తప్ప, తండకారణ్యంలోని దక్షిణ బస్తర్ జిల్లాలో కొందరు సాయుధ మావోయిస్టులు తప్ప దాదాపు మావోయిస్టు నక్సలైట్ల కార్యకలాపాలు లేషా మాత్రంగా మిగిలిపోయాయి.

**■ మావోయిస్టుల దారి ఎటు?**

సాయుధ పోరు అనే పద్మవ్యూహంలో ప్రవేశించిన మావోయిస్టులు అందులో ఉండలేక బయటపడలేక సతమతమైన తీరును లోకం గమనించింది. మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యులు సిద్ధాంత కర్తలు ఇప్పుడు దారి తెన్ను తెలియక వివిధ రకాలుగా మాట్లాడుతున్నారు.దేవ్ జీ మీడియాతో మాట్లాడుతూ తాను లొంగి పోలేదని అరెస్టు మాత్రమే అయ్యానని చెబుతున్నాడు. అతనిలాగే ఒకరిద్దరూ మావోయిస్టు మాజీ నాయకులు కూడా అదే భాషలో మాట్లాడుతున్నారు.తాము ఆయుధాలు తీసుకొని రాలేదని, ప్రభుత్వము తమ పార్టీ రాజకీయ కార్యకలాపాలకు అనుమతి ఇస్తే ప్రజాక్షేత్రంలో పనిచేస్తామని అర్థం కాని వివరణలు ఇస్తున్నారు.
ప్రభుత్వము మావోయిస్టు రాజకీయ కార్యకలాపాలకు అనుమతి ఇస్తే అడవిలో మిగిలిన సాయుధ మావోయిస్టులందరూ సరెండర్ అవుతారని ప్రధాన నాయకుడి హోదాలో దేవ్ జీ అనడం వారి గందరగోళాన్ని, వారి అమాయక కార్యాచరణను చాటుతున్నది.
ఒకవేళ ప్రభుత్వము మావోయిస్టుల పై ఉన్న నిషేధాన్ని తొలగిస్తే ఆయుధాలతో మిగతావారు లొంగిపోతారు..ప్రభుత్వం అలా చేయని పక్షంలో అడవిలో మిగిలిన మావోయిస్టులు మళ్లీ సాయుధ పోరు ప్రారంభిస్తారు? అని చెబుతున్న మావోయిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి ఇస్తున్న సందేశం ఏమిటి?
అటువంటప్పుడు అరెస్టుగా చెప్పుకుంటున్న ఈ లొంగుబాటుకు అర్థం ఏమిటి?

**■ మావోయిస్టుల ఈ గందరగోళం ప్రజలకు వారిపై ఉన్న అభిమానాన్ని పలుచన చేస్తున్నది**

సాయుధ పోరు చేయలేమని, ఆ పోరాట మార్గం తప్పు అని ఒప్పుకుంటునప్పుడు మళ్లీ షరతులు ఎందుకు?. బేషజాలు ఎందుకు? పోరాటం అనే ఆహారం పాచిపోయినప్పుడు పారవేయడం తప్ప వేరే మార్గం ఏమున్నది?. పాచిపోయిన ఆహారానికి పోపు వేస్తే లాభమేమిటి?
దేవ్ జి మీడియా ప్రకటన తన వ్యక్తిగతమా! మావోయిస్టు పార్టీ నిర్ణయమా!.. అనే సంశయము పోలీసులకు, ప్రభుత్వానికి, ప్రజలకు కూడా ఉన్నది.

**■ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ఒక్కటే అన్ని రకాల సిద్ధాంత ఆచరణలకు జవాబు**

ప్రజల భాగస్వామ్యం లేని ఏ వ్యవస్థ కూడా నిలువదు. ప్రజల ఆలోచనలు ఆయుధాలతో మలుపు తిప్పే సాహసం, ఉద్యమం ఎప్పుడూ విజయం సాధించదు. ప్రజా ఉద్యమాల్లో అవసరమైతే ప్రజలే తమ చేతికి అందిన పనిముట్లను ఆయుధాలుగా మార్చుకొని సమాజాన్ని మార్చుకుంటారు, కాపాడుకుంటారు.
భారతీయ అవతార విశేషాలలో దేవుళ్లందరి చేతిలో ఆయుధం ఉంటుంది. ఈ ఆయుధంతో దుష్ట శిక్షణ చేయాలని భారతీయ ధర్మం ఎప్పుడో చెప్పింది.
షష్టిపూర్తి వత్సర చక్రం పూర్తితో కమ్యూనిస్టు మావోయిస్టు సాయుధ ఉద్యమ పస తేలి పోయింది.

**■ చైనా చైర్మన్ మావో మా చైర్మన్ అని ప్రకటించుకొని సాయుధ పోరు ప్రారంభించిన మావోయిస్టు నక్సలైట్ల పట్ల ప్రజలకు సద్భావన లేదు**

ఉద్యమ కార్యాచరణతో ప్రజలను చైతన్యవంతం చేస్తున్నాము అనే భ్రమలో కమ్యూనిస్టు మావోయిస్టు నక్సలైట్లు ప్రజలను మరింత గందరగోళం లోనికి, అజ్ఞానంలోనికి నెట్టి వేశారు.

**■ ప్రజల వివేకాన్ని మావోయిస్టు అవమానపరిచారు. రష్యా,చైనా, పోలాండ్, వియత్నాం, హాలాండ్, క్యూబా లాంటి దేశాలు జాతీయ వాద బలంతో తమ తమ దేశాల్లో కమ్యూనిజాన్ని దేశీయ పాలన రీతిలోకి మలుచుకున్నారు**

కానీ భారత కమ్యూనిస్టులు, మావోయిస్టులు రకరకాల భావ దారిద్ర్యంతో బాధపడుతున్నారు.
కమ్యూనిస్టులకు జాతీయవాదం అంటే వ్యతిరేకత ఎందుకు?.
కమ్యూనిజానికి రకరకాల విశేషణాలు తగిలించుకొని మురిసిపోయారు.
మార్క్సిజం లెనినిజం మావో ఆలోచన విధానాలు వర్ధిల్లాలి అంటూ వివిధ కమ్యూనిస్టు పార్టీలు నామకరణాలు చేసుకున్నప్పటికీ భారత ప్రజలు ఈ విదేశీ కమ్యూనిస్ట్ నాయకులను, తమ దేశ నాయకులుగా ఒప్పుకోలేకపోతున్నారు.
భారత ప్రజలు మార్క్స్ ను, లెనిన్ ను, మావోను తమ దేశ నాయకులుగా అంగీకరించడం లేదని
ఏ కమ్యూనిస్టు కూడా ఒప్పుకోడు.

**■ భారతదేశంలో "అసలు కమ్యూనిజం" ఎవరిదో, ఏ పార్టీది నిజమైన కమ్యూనిజమో తెలియని గందరగోళానికి ప్రజల గురయ్యారు**

**■ ప్రపంచ కార్మికులారా ఏకంకండి అని పిలుపునిచ్చిన కమ్యూనిస్టులు మాత్రం భారతదేశంలో చీలికలు పేలికలుగా... గుర్తు లేనన్ని పేర్లతో... లెక్కలేనన్ని గ్రూపులుగా విడిపోయారు**

**■ జగిత్యాల జైత్రయాత్ర, ఇంద్రవెల్లి అమరత్వం అంటూ సాగిన మావోయిస్టుల సాయిధయాత్ర ఒక శూన్యంలోకి జారుకున్నది. జైత్రయాత్ర ఒక శూన్య యాత్రగా మిగిలిపోయింది**

కమ్యూనిజం మాత్రమే నిజమైంది మిగతా సిద్ధాంతాలన్నీ బూర్జువా భావాలు అంటూ బయలుదేరిన మావోయిస్టు నక్సలైట్లు చివరికి ప్రజలకు అర్థం కాని బ్రహ్మ పదార్థం లాగా కనిపిస్తున్నారు.

**■ ఆధ్యాత్మికత అంటే ఏమిటో వివరించలేనట్టుగా..కమ్యూనిజం అంటే ఏమిటో వివరించలేని భావ దారిద్రంలోనికి జారిపోయారు**

శాస్త్రీయత పేరుతో, హేతువాదం పేరుతో అశాస్త్రీయమైనటువంటి ప్రతిపాదనలతో గందరగోళంలో చిక్కుకుపోయిన కమ్యూనిస్టు మావోయిస్టు నక్సలైట్లు ఇప్పుడు మరొక సైదాంతిక పునాది కొరకు,భూమిక కొరకు వెతుకులాటలో ఉన్నారు.
భారతీయత, జాతీయత అంటే ఒక సంకుచిత భావమని ప్రచారం చేస్తూ బతికిన కమ్యూనిస్టు మావోయిస్టు నక్సలైట్లు ఇప్పుడు తమ అశాస్త్రీయ కార్యాచరణ పట్ల చింతనలో పడిపోయారు.

**■ తమ సాయుధ పోరాటం ఒక చారిత్రక తప్పిదం అని త్వరలో ప్రకటించి చేతులు దులుపుకుంటారు**

మావోయిస్టుల సాయుధపోరు ఎవరి కొరకు?. మావోయిస్టులు అరెస్టు అయినా, లొంగిపోయినా, సాయుధ పోరు విరమించినా, ఏమి చేసినా ఈ ప్రజల కొరకు ఈ సమాజం కొరకే. సమాజం కొరకు ప్రజల కొరకు పుట్టిన మావోయిజం పంతాలకు పట్టింపులకు పోకూడదు. కార్యాచరణను అందులోని లోపాలను ధైర్యంగా అంగీకరించి దారి మార్చుకోవాలి.

**■ కమ్యూనిస్టు మావోయిస్టు నక్సలైట్లకు అసహనం ఎక్కువ. ఈ శక్తులు అసహనవాదులు**

తాము మాత్రమే పవిత్రులమని, తమ సిద్ధాంతం మాత్రమే ప్రామాణికమని విర్రవీగే ఒక పిడివాద మనస్తత్వంలో కమ్యూనిజం ఈదులాడుతున్నది.
అయోమయంలో మగ్గిపోయిన ప్రజలకు, కార్యకర్తలకు సరైన సామాజిక కార్యక్రమాన్ని చూపి సమాజంలో లీనం చేయవలసిన బాధ్యత మావోయిస్టులపై ఉన్నది.
ఈ కమ్యూనిస్టు మావోయిస్టు నక్సలైట్ల సాయుధ సంఘర్షణతో లెక్కలేనన్ని కుటుంబాలు దెబ్బతిన్నాయి. లెక్కలేనంతమంది తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యారు. లెక్కలేనంతమంది చనిపోయారు. లెక్క లేనంత మంది జైళ్లలో మగ్గుతున్నారు. ప్రభుత్వం ఇటువంటి అభాగ్యులను ఆదుకోవడానికి ఒక మానవీయ కార్యక్రమముతో ముందుకు రావాలి.
ప్రభుత్వం గనుక ఇటువంటి ప్రతిపాదన చేసినప్పుడు మావోయిస్టులు కూడా కలిసి రావాలి. ఎత్తుగడల పేరుతో కమ్యూనిస్టు మావోయిస్టు నక్సలైట్లు మళ్లీ వెన్నుపోట్లు పొడవకుండా నిజాయితీగా తమ మార్గాన్ని ఎన్నుకోవాలి.
లేనిపక్షంలో సాయిధ పోరు ప్రజలకు మరొక పీడకలగా మిగిలిపోతుంది. గతకాలపు పిండారీల మాదిరిగా, ఒక హింసాత్మక ముఠాగా మాత్రమే మావోయిస్టులు చరిత్రలో మిగిలిపోతారు.
గద్దర్ పాట పాడినట్టుగా మన దేశాన్ని నేల తల్లి అని పిలిచినా, భూమాత అని పిలిచినా, జాతీయ వాదులు అన్నట్టుగా భరతమాత అని పిలిచినా.. ఈ నేల మనది, ఈ భూమి మనది.ఇది అందరిదీ. సామాన్యులను, అమాయకులను, అభాగ్యులను పీడించే కంటకులకు చైతన్య సమాజం హద్దులు విధించి తీరుతుంది. అవి ఎవరైనా సరే.. ఏ సిద్ధాంతమైనా సరే.సమాజం చైతన్య శీలమైనది. సమాజం నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. ఆ ప్రవాహం మంచి నీటిదా? మురికి నీటిదా? అనేది కాలం చెబుతుంది.కాలాన్ని మించిన న్యాయమూర్తి లేదు.

**■ స్వార్థ అన్యాయములనాపుటకు, రంగన్న మామా కొందరన్నలు తిరుగుబాటనిరి.సమాజమంతా కంపు కొడుతుంటే రంగన్న మామా.. తిరుగుబాటు ఎవరి మీదోయి? రక్తపాతం రగిలితేను మిగిలేటోళ్ల ఎవ్వరోయి? చెట్లు పుట్టలు గుట్టలూ మరి మనుషులా పీనుగు కుప్పలు**

అంటూ విద్యార్థి ఉద్యమాల కాలంలో పాడుకున్న పాటలివి. సమాజాన్ని సంఘర్షణతో కాదు సంస్కరణతో మార్చాలి.. అంటూ విద్యార్థులు యువకులు దశాబ్దాలుగా నినదిస్తూనే ఉన్నారు.
హింస మార్గము సంపూర్ణ ప్రత్యామ్నాయ మార్గం కాదు. సంస్కరణ వాదులే నాయకులుగా నిలిచిపోయారు. అటువంటి వారే సమాజానికి మార్గదర్శకులుగా ఇప్పటికీ నిలిచి ఉన్నారు.
ప్రగతిశీల ప్రజాస్వామ్య వాదులు అంతా ఒకటయ్యి ఉన్నతమైన సమాజాన్ని ఆదర్శ సమాజాన్ని నిర్మించాలి.సమాజ శ్రేయస్సును మరిచిన ప్రభుత్వాల నిష్క్రియా పరత్వాన్ని, పాలనా వ్యవస్థను అందరము కలిసి ప్రభావితం చేయాలి,మార్చాలి.రాజ్యాంగం పరిధిలోనే చట్టాలను బలోపేతం చేయాలి పరిపుష్టం చేయాలి. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ అని చెప్పిన భారతీయ సూక్తి నిజం కావాలి. సిద్ధాంతం ఏదైనా.. భావజాలం వేరైనా.. మనందరం ఈ భరతమాత బిడ్డలమే. సర్వేజనా సుఖినోభవంతు అనే మన భారతీయ ఆకాంక్ష సఫలం కావాలి.. ఆ ఆకాంక్ష మళ్ళీ జీవం పోసుకోవాలి.భారత రాజ్యాంగ నీడలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య బాటలో మావోయిస్టు నక్సలైట్లు పయనించాలి.కమ్యూనిజం, మావోయిజం స్ఫూర్తితో ప్రజాస్వామ్య రీతిలో ప్రభుత్వము ఏర్పాటు చేయడానికి వారి కార్యక్రమాలు రూపొందించుకోవాలి..ఆ కార్యక్రమాలతో గనుక కమ్యూనిస్టు మావోయిస్టు నక్సలైట్లు అధికారుల్లోకి వస్తే ప్రజా పాలన అనే ఆయుధము వారి చేతిలోకి వస్తుంది.ఆ ఆయుధంతో తమ సిద్ధాంతాలను ఆచరణలో పెట్టుకునే అవకాశం కూడా దొరుకుతుంది.త్రిపుర, పశ్చిమ బెంగాల్, కేరళ ను పాలించిన రీతిలోనే కమ్యూనిస్టు మావోయిస్టు నక్సలైట్లు ప్రజల ఓట్లతో,ప్రజా మద్దతుతో అధికారం చేపట్టాలి. ప్రజాస్వామ్యబద్ధంగా మావోయిస్టులు మన దేశాన్ని పాలించడం ఆహ్వానించదగ్గది.
తాము నమ్మిన ఆశయం కొరకు జీవితాలను త్యాగం చేసిన మావోయిస్టులు విశాల ప్రజాక్షేత్రంలోకి రావడం మంచి పరిణామం. సాయుధ పోరు విరమించుకొని ఇప్పటివరకు లొంగిపోయిన నాయకులు, అరెస్ట్ అయిన నాయకులు తమ సిద్ధాంతాలను,రాజకీయ కార్యక్రమాలుగా రూపొందించుకుని పనిచేయడం ఆహ్వానించదగ్గది.

**భారత రాజ్యాంగం వర్ధిల్లాలి.**
**డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కి జై..**
**భారత్ మాతా కీ జై...**

# సంఘ సభ్యులకు స్కూల్ యూనిఫాం కుట్టడంలో శిక్షణ -- మెప్మా పీడీ స్వరూప రాణి





**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట**
రాష్ట్ర ప్రభుత్వం, మెప్మా మిషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు వారి ఆర్థిక స్థితిని మెరుగుపర్చేందుకు స్కూల్ యూనిఫాం కుట్టడంలో ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని జమ్మికుంట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. స్వరూప రాణి శుక్రవారం సందర్శించి, శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా పీడీ స్వరూప రాణి మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేయడానికి ఇలాంటి శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. “కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడం ప్రభుత్వ దీర్ఘకాల లక్ష్యం. మహిళలు తమలోని నైపుణ్యాలను గుర్తించి అభివృద్ధి చేసుకుంటే కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడటంతో పాటు సమాజ అభివృద్ధికి కూడా తోడ్పడతారు” అని పేర్కొన్నారు.
ప్రస్తుతం అనేక మహిళలు ఇంటి వద్దే టైలరింగ్ పనులు చేస్తున్నప్పటికీ, సరైన సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యత ప్రమాణాలు, డిజైన్ అవగాహన వంటి అంశాలలో మరింత శిక్షణ అవసరమని ఆమె తెలిపారు. ఈ శిక్షణ ద్వారా యూనిఫాం కుట్టడంలో కొలతలు తీసుకోవడం, కటింగ్ విధానం, మెషిన్ వినియోగం, నాణ్యమైన కుట్టు పద్ధతులు, సమయపాలన వంటి అంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.
శిక్షణలో మొత్తం 41 మంది మహిళా సంఘ సభ్యులు పాల్గొంటున్నారని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నాలుగు రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. శిక్షణ పూర్తయ్యాక వీరికి స్కూల్ యూనిఫాంల తయారీకి సంబంధించిన ఆర్డర్లు అందేలా చర్యలు తీసుకుంటామని, తద్వారా వారికి స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.
అదేవిధంగా శిక్షణ పొందుతున్న మహిళలకు మధ్యాహ్న భోజనం, తాగునీరు, అవసరమైన మెటీరియల్, యంత్రాలు వంటి అన్ని సౌకర్యాలను అందిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని మహిళలు సమర్థవంతంగా వినియోగించుకుని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, భవిష్యత్తులో చిన్న స్థాయి యూనిట్లు స్థాపించి మరింత ఆదాయం పొందేలా ప్రయత్నించాలని సూచించారు.
శిక్షణలో పాల్గొన్న మహిళలు కూడా ఈ కార్యక్రమంపై సంతోషం వ్యక్తం చేస్తూ, ఇలాంటి శిక్షణలు తమకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ సహకారంతో మరిన్ని అవకాశాలు లభిస్తే తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తామని చెప్పారు.
ఈ కార్యక్రమంలో మెప్మా డీఎంసీ శ్రీవాణి, ఇంచార్జ్ హెచ్. జ్యోతి, స్వరూప, మంజుల తదితరులు పాల్గొని శిక్షణ నిర్వహణను పర్యవేక్షించారు.

# మూడవ రోజుకు చేరిన విద్యుత్ కార్మికుల నిరవధిక సమ్మె...



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 10:**
తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ కార్మికులు చేపట్టిన నిరవధికే సమ్మె మూడవ రోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో బాగంగా పెద్దపెల్లి పట్టణంలోని బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి నిరసనకు దిగారు. అనంతరం రాఘవపూర్ ఎస్సీ కార్యాలయం ఆవరణలో విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె మూడవ రోజు కొనసాగింది. ఈ సమ్మెకు 1104 యూనియన్ నాయకులు రామానుజం కరుణాకర్, 327 యూనియన్ నాయకులు లింగయ్య, సిఐటియు నాయకులు వాగునాయక్ నర్సయ్య, ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు ఐ.కృష్ణ, ఇ.నరేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి తాంద్ర సదానందం విప్లవ కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు, పలు సంఘాల నాయకులు తమ మద్దతు ప్రకటించి సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులకు స్టాండింగ్ ఆర్డర్స్ రద్దుచేసి ఏపీఎస్ఈబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, అన్ మ్యాన్ కార్మికులను సంస్థలో విలీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. మీటర్ రీడర్స్, పీస్ రేటు కార్మికులకు జీవో ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించేంత వరకు పూర్తి స్థాయిలో తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తామని విద్యుత్ ఆర్టిజన్స్ జెఏసి నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ,విద్యుత్ సంస్థలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ పెద్దపల్లి జిల్లా చైర్మన్ మల్లోరి కిషన్ రెడ్డి, అన్ మ్యాన్ నాయకులు రమేష్ ఆర్టిజన్లు దాసరి కోటి, గోపతి తిరుపతి, కొండి రమేష్, షిరీష్, కలీమ్, రఘు, సుమన్, షఫి, సురేష్, ఎల్లయ్య, ఆదికొండల్, ఆర్టిజన్లు, స్పాట్ బిల్లర్లు, పీస్ రేట్ కార్మికులు ఆర్టిజన్లు పాల్గొన్నారు.

# వెల్దుర్తిమాసాయిపేట మండలాల్లోని ఐకెపి వారి విధానం కేంద్రాలలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపిన ఐకెపి ఎపిఎం సుభాష్ గౌడ్



**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 10**
మెదక్ జిల్లా వెల్దుర్తి మాసాయిపేట మండలాలలోని పలు గ్రామాలలో జిల్లాకలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదేశాల మేరకు ఉమ్మడి మండలాలసెంటర్ లో ఉన్న గ్రామంలో సెంటర్ రెడీ గా ఉన్నట్టు గా బ్యానర్ పెట్టాలని చెప్పడం జరిగింద అని. గురువారం నాడువెల్దుర్తి మండలంలో మార్కెటింగ్ సెంట్రల్లో ఉన్న గ్రామలు కుక్కునూరు అందుగులపల్లి శెట్టిపల్లి దామరంచ రామాయపల్లి వెల్దుర్తి సమైక్య కేంద్రాలలో బ్యానర్ ఏర్పాటు చేయడం జరిగిందని మాసాయిపేట మండలంలోని బొమ్మారం ఉప్పులపల్లి నగ్సన్పల్లి రామంతాపూర్ హకీంపేట్ గ్రామాలలో గల వరి దానం కేంద్రాలలో ఏర్పాటు చేయడం జరిగిందని ఉమ్మడి మండలాల ఐకెపి ఎపిఎం సుభాష్ గౌడ్ తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం వరి ధాన్య కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని రైతులు సకాలంలో వారు పండించినటువంటి పంటను పరిధాన్యం కేంద్రాలకు తీసుకువచ్చి మాతో మా సిబ్బందితో సహకరించి మీకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే మీ యొక్క ఇబ్బందులను తీర్చగలి గే ప్రయత్నం చేయడం మా సంబంధిత సిబ్బంది మీకు దీంతో ప్రోత్సాహంగా ఉంటుంది అని వరి ధాన్యం కేంద్రాల వద్ద రైతులు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా అన్ని చర్యలను తీసుకోవడం జరుగుతుందని రైతులు పండించినటువంటి పంట వరి ధాన్యాన్ని తూకం చేయడంలో వెనక ముందు అయితే రైతులు ఎటువంటి ఇబ్బందులకు గురి కావద్దని నేటి ప్రపంచంలో ఏ ఒక్క ప్రభుత్వ పనులు చేయాలి అంటే అన్ని ఆన్లైన్లో నే చేయడం జరుగుతుంది కొన్ని సందర్భాలలో సర్వర్ డౌన్ ఉండడంతో కూడా వరి ధాన్యాన్ని తూకం చేయడంలో ఆలస్యం కావచ్చునని అలాంటి సమస్య ఉన్నప్పుడు ఈ అధికారి ఏమీ చేయలేని పరిస్థితిని ఎదుర్కోవడం జరుగుతుందని అలాంటి సందర్భంలో రైతులు ఆవేశాలతో అలజరులకు దిగరాదని మాకు రైతుల సహకారం ఎంతో అవసరమని అందరం కలిసి మెలిసి ఉంటే కలదు సుఖం అనే విధంగానే రైతులు మాతో సహకరించాలి మేము కూడా రైతులకు సహకరిస్తామని ఐకెపి ఎపిఎం సుభాష్ గౌడ్ తెలిపారు ఈ కార్యక్రమంలో సిఏలుపలు గ్రామాల రైతులు పాల్గొన్నారు

# విద్యారణ్యపురిలో 8 లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ.

▪ నగరాన్ని సమాంతరంగా అభివృద్ధి చేస్తాం: మేయర్ కొలగాని శ్రీనివాస్.





**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 10**
నగరపాలక సంస్థ అభివృద్ధి లో భాగంగా శుక్రవారం రోజు నగరంలోని 3 వ డివిజన్ లో మేయర్ కొలగాని శ్రీనివాస్ పర్యటించారు. విద్యారణ్యపురి రోడ్డు నెంబర్ 1 లో స్థానిక కార్పోరేటర్ సాదవేణి లావణ్య మునింధర్, సుడా చైర్మన్ నరెంధర్ రెడ్డి తో కలిసి 8.70 లక్షల నిధులతో సీసీ రోడ్డు కు భూమీ పూజ చేసి పనులు ప్రారంభం చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటించి, సీసీ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. సీసీ రోడ్డు నిర్మాణం కు శ్రీకారం చుట్టడం పట్ల స్థానిక డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పనుల ప్రారంభానికి ముఖ్య అతిథిగా వచ్చిన మేయర్ కొలగాని శ్రీనివాస్ ను శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.
మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ
నగర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా మా పాలకవర్గం పని చేస్తుందని స్పష్టం చేశారు. విలీన గ్రామాల, శివారు ప్రాంతాల డివిజన్లను ప్రాధాన్యత గా తీస్కోని నగరంతో సమానంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా 3 వ డివిజన్ విద్యారణ్యపురి లో 8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభం చేశామని తెలిపారు. నగర వ్యాప్తంగా కాలనీల్లో అంతర్గత రోడ్లను, డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్ది, ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. నగర ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. చేపట్టిన పనులను నాణ్యతతో గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికాకులను ఆదేశించినట్లు తెలిపారు. కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మా పాలకవర్గం ముందుకు సాగుతుందని తెలిపారు.

# రాచపల్లి దేవాలయల్లో విద్యుత్తు మీటర్ అమర్చండి

▪ విద్యుత్ ఏ ఇ కీ వినతి పత్రం ఇచ్చి సర్పంచ్ బూస అశోక్

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట ఏప్రిల్ 10**



కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం రాచపల్లి గ్రామంలో దేవాలయాల అభివృద్ధి దిశగా కీలక ముందడుగు పడింది. గ్రామ సర్పంచ్ బూస అశోక్ యాదవ్ మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న పలు పురాతన దేవాలయాలకు ఇంకా విద్యుత్ సదుపాయం లేకపోవడం వల్ల భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రత్యేకంగా సాయంత్రం, రాత్రి వేళల్లో పూజలు, కార్యక్రమాలు నిర్వహించడం కష్టసాధ్యంగా మారిందని తెలిపారు.
ఈ నేపథ్యంలో గ్రామంలోని ప్రముఖ దేవాలయాలైన
శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం
శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం
శ్రీ గట్టు మల్లికార్జున స్వామి దేవాలయం
పోచమ్మ తల్లి దేవాలయం
ఈ నాలుగు దేవాలయాలకు తక్షణమే విద్యుత్ కనెక్షన్లు కల్పించాలని నిర్ణయించారు. ప్రతి దేవాలయానికి ఒక్కొక్క మీటర్ చొప్పున మొత్తం నాలుగు విద్యుత్ మీటర్లు మంజూరు చేయడంతో పాటు, అవసరమైన విద్యుత్ స్తంభాలు (పోల్స్) మరియు ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఏర్పాటు చేయాలని కోరుతూ ఇల్లందకుంట విద్యుత్ శాఖ ఏఈకి అధికారికంగా వినతి పత్రం అందజేశారు.
ఈ సందర్భంగా సర్పంచ్ బూస అశోక్ యాదవ్ మాట్లాడుతూ, దేవాలయాలు గ్రామ ప్రజల ఆధ్యాత్మిక కేంద్రాలు మాత్రమే కాకుండా, గ్రామ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. వాటి అభివృద్ధి కోసం గ్రామపంచాయతీ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యుత్ సౌకర్యం కల్పించడం ద్వారా భక్తులకు మెరుగైన వాతావరణంలో పూజలు నిర్వహించే అవకాశం లభిస్తుందని చెప్పారు.
వినతి పత్రాన్ని స్వీకరించిన విద్యుత్ శాఖ ఏఈ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యను పరిశీలించి తగిన విధంగా పై అధికారులకు నివేదిక పంపించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అవసరమైన సాంక్షన్లు వచ్చిన వెంటనే పనులను ప్రారంభిస్తామని తెలిపారు.
గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు ఈ చర్యపై సంతోషం వ్యక్తం చేస్తూ, దేవాలయాల్లో విద్యుత్ సౌకర్యం కల్పిస్తే రాత్రి వేళల్లో కూడా దీపారాధనలు, పండుగల వేడుకలు మరింత ఘనంగా నిర్వహించవచ్చని అభిప్రాయపడ్డారు.
ఇటీవల గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, రాచపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని సర్పంచ్ పేర్కొన్నారు

# మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**కరపత్రం ప్రతినిధి మంథని ఏప్రిల్ 10**



ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ గురువారం సాయంత్రం కలిశారు. కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రచారం జరుగుతున్న క్రమంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం సాయంత్రం జగిత్యాలలో జీవన్‌రెడ్డితో బేటీ అయి చర్చలు జరుపనున్న నేపధ్యంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆయనను కలిసి పలు విషయాలను చర్చించారు. గతంలో జరిగిన అనుభవాలు, ప్రస్తుత పరిస్థితపై ఇరువురు మాట్లాడుకున్నారు. బీఆర్ఎస్ పార్టీలో చేరడంపై ముందస్తుగా జీవన్‌రెడ్డికి ఆయన స్వాగతం పలికారు.

# పోలీసుల కిరాతక చర్యలకు ఓ హెచ్చరిక తమిళనాడు మధురై కోర్టు తీర్పుపై సర్వత్రా చర్చ

– పోలీసులపై పనిభారం తగ్గించాలని సూచనలు

:ఆరేళ్ళ క్రితం తమిళనాడులో జరిగిన ’లాకప్ డెత్’ కేసులో ట్రయల్ కోర్టు విచారణ ముగిసి తొమ్మిది మంది పోలీసులను ముద్దాయిలుగా ఖరారు చేస్తూ వారందరికీ మరణ శిక్ష విధించడం సంచలనం కలిగించింది. ఈ తీర్పుపై ఇప్పుడు సర్వత్రా చర్చ సాగుతోంది. పోలీసుల అతిపై కోర్టు సరైన తీర్పు ఇచ్చిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాగే స్టేషన్‌లో టార్చర్ పెట్టే వారికి ఈ కేసు ఓ హెచ్చరికగా సూచిస్తున్నారు. ఇక వివరాల్లోకి వెళితే...కరోనా సమయంలో సదరు లాక్‌డౌన్ నిబంధనల్ని అతిక్రమించారన్న కారణంతో చిరు వ్యాపారులైన తండ్రీకొడుకులను అరెస్ట్ చేశారు. వారిని ఆ రాత్రంతా చిత్రహింసలకు గురిచేయగా ప్రాణాలు కోల్పోయారు. కస్టడీ లోకి తీసుకున్న ఆరోగ్యవంతులైన ఇద్దరు పౌరులు ఒక్క రోజులోనే అనారోగ్యంతో మరణించడానికి పోలీసులు పెట్టిన చిత్రవధ ఏకైక కారణం అన్నది తేలిపోయింది. ఆ దుర్మార్గపు చర్య ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, ఆందోళన నింపగా మద్రాస్ హైకోర్టు సుమోటోగా కేసుని స్వీకరించి?సిబిఐ దర్యాప్తునకు ఆదేశించింది. ఫలితంగా పోలీసుల నేరం నిరూపణ అయ్యింది. బాధాకరమైన విషయమేమిటంటే ఆ మృతులిద్దరూ కరోనా లాక్‌డౌన్ నిబంధనల్ని కూడా అతిక్రమించలేదని. అది కూడా తప్పుడు బనాయింపు అని. ఆ సంఘటనకి బాధ్యులైన 9 మంది పోలీసు అధికారులకూ నేడు కోర్టు మరణ శిక్ష విధించడం సరైన తీర్పు. ఇంకా పైకోర్టులో అప్పీళ్లు, న్యాయ పక్రియలు పూర్తయ్యి అంతిమ తీర్పు రావడం ఎలాఉన్నా ప్రస్తుతానికి బాధిత కుటుంబాలకు ఊరట. అధికారాన్ని అడ్డుపెట్టుకుని,చేయగూడని పనులు చేసే అధికారులకు ఇది ఒక హెచ్చరిక. ఇదే సమయంలో దేశం పోలీసు సంస్కరణల దిశగా ఆలోచించాలి. వారు ఎదుర్కొంటున్న విపరీత పని ఒత్తిడి సమస్య, సిబ్బంది లేమి, దర్యాప్తు, శాంతి భద్రతలను వేర్వేరుగా నిర్వహించే యంత్రాంగం లాంటివి తీర్చుతూనే, తప్పుడు పనులు చేసే అధికారుల్ని వెంటనే కఠినంగా శిక్షించే ఏర్పాట్లు ఉండాలని అంటున్నారు. సమాజానికి అప్పుడే శాంతిభద్రతలకు భరోసా ఉంటుందని భావిస్తున్నారు.